క్లుప్తంగా

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

రోలుగుంట: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో జాను ప్రసాద్, ఎస్వో తులసి తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర రేఖ దిగువన ఉన్న బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో వారైతే రూ.1.40 లక్షలు మించకూడదన్నారు.

ఒకటి నుంచి ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రమణ

దేవరాపల్లి: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, మండల అధ్యక్షుడు కొరుపోలు శ్రీను తెలిపారు. స్థానిక ఉషోదయ కాన్సెప్ట్ స్కూల్‌లో ప్రారంభిస్తామన్నారు. ఏటా మాదిరిగా ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేస్తామన్నారు. రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో శిక్షణ ఇస్తామని, విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9985250072,9703556257 సంప్రదించాలని కోరారు.

విగ్రహ ప్రతిష్ట వేడుకలు ప్రారంభం



వేడుకల్లో పాల్గొన్న అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: జమ్మాదేవి పేట జంక్షన్‌లో కన్యకాపరమేశ్వరి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఇక్కడ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేయనుండగా, శుక్రవారం ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు.

వడ్డాదిలో చలివేంద్రాల ఏర్పాటు



వడ్డాదిలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలో శుక్రవారం మూడు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. పాదచారులు వేసవి తాపానికి గురికాకుండా ప్రభుత్వం ఆదేశాలతో ఈవో లవరాజు ఆధ్వర్యంలో ఇక్కడ నాల్గు రోడ్ల జంక్షన్‌లో మాడుగుల రహదారి, కొత్తూరు జంక్షన్ వెంకటేశ్వరస్వామి ఆర్చి, మార్కెట్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వీఆర్వో సుధాకర్, సచివాలయ ఉద్యోగులు శ్రావణ్, ఉమ, భాగ్య, శ్రీను, భవానీ పాల్గొన్నారు.

గాయపడ్డ యువకుడు మృతి

కె.కోటపాడు : నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటనలో గాయపడ్డ చౌడువాడ గ్రామానికి చెందిన ఆళ్ల నూకరాజు(35) శుక్రవారం మృతిచెందాడు. ఈ మేరకు కె.కోటపాడు పోలీసులకు మృతుని భార్య మాధవి ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు. చౌడువాడ నుంచి శెరీరోడ్డులో నడుచుకుంటూ పొలానికి వెళ్తున్న నూకరాజును వెనుక నుంచి వచ్చిన కారు గురువారం బలంగా ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ నూకరాజును కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నూకరాజు ఆరోగ్య పరిస్థితి మరింత విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఎం. కోడూరు.. అభివృద్ధి జోరు



రైతు భరోసా కేంద్రం



ఎం. కోడూరు గ్రామ ముఖచిత్రం

సర్పంచ్ కృషికి ప్రభుత్వ సహకారం తోడైతే ఎంతటి సమస్యలున్న గ్రామమైనా ప్రగతి పరుగులు పెట్టక మానదు. దశాబ్దాలుగా అభివృద్ధి అంటే ఏంటో తెలియని ఆ గ్రామ రూపురేఖలు నేడు పూర్తిగా మారిపోయాయి. కోట్లాది రూపాయలతో పలు ప్రభుత్వ భవనాలు వెలిశాయి. కార్పొరేట్‌కు దీటుగా అధునాతన హంగులద్దుకున్న పాఠశాల, ఇంటి వద్దకే తాగునీరు సరఫరా, గడప దాటగానే సీసీరోడ్లు, సొంతూరులోనే వైద్య సేవలు, ఇలా ఒకటేమిటి సకల సౌకర్యాలు సమకూర్చుకున్న ఎం.కోడూరు పంచాయతీ ఆదర్శంగా మారింది.

- ప్రగతి పథంలో గ్రామ పంచాయతీ
- కోట్లాది రూపాయలతో వెలసిన రోడ్లు, ప్రభుత్వ భవనాలు
- రూ.30 లక్షలతో కల్యాణ మండప నిర్మాణం
- సొంతూరులోనే వైద్య సేవలు
- సంక్షేమ కార్యక్రమాలకు పెద్ద పీట

మాడుగుల రూరల్: ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్న ఎం. కోడూరు గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో నడుస్తోంది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సహకారంతో రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, మరో రూ.20 కోట్ల సంక్షేమ లబ్ధి ఇక్కడ ప్రజలకు కలిగింది. వివాహాలు, ఇతర శుభ కార్యాల నిర్వహణకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను ఆయన దృష్టికి సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు తీసుకెళ్లారు. దీంతో రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.36 లక్షల మంజూరు చేశారు. ఈ మొత్తంతో కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు.

గ్రామంలో అభివృద్ధి పనులు..



అభివృద్ధి చేసిన పాఠశాల

- ప్రధానంగా గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా ఉండేది. వర్షాలు, వరదలు వస్తే 30 సంవత్సరాలుగా అంత్యక్రియల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్య నివారణతో భాగంగా రహదారితోపాటు బ్రిడ్జి నిర్మించారు.
- కళ్లంపాకల దగ్గర పశువులు, రైతులకు తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా 34 మంచినీటి బోర్లు మంజూరు చేశారు.

నియోజకవర్గం :	మాడుగుల
మండలం :	మాడుగుల
పంచాయతీ :	ఎం. కోడూరు
పంచాయతీ జనాభా:	3,600
ఓటర్లు :	3,015
ప్రత్యక్ష, పరోక్షంగా గ్రామానికి చేకూరిన లబ్ధి :	రూ.46,94,59,450

- ఎరుకుల వీధి, ఎస్సీ కాలనీ, తదితర చోట్ల డిప్యూటీ సీఎం సహకారంతో రూ.1.12 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు.
- శిథిలావస్థకు చేరి సిబ్బంది లేక ప్రజలు వైద్య సేవల కోసం ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వ హోమియో వైద్యశాలను రూ.6 లక్షలతో పునర్నిర్మించారు. ఇక్కడ ఇద్దరు వైద్యులు, ఇతర సిబ్బందిని నియమించారు. దీంతో హోమియో వైద్యశాలలో ప్రస్తుతం వైద్య సేవలు అందుతున్నాయి.



ఎం. కోడూరు గ్రామ సచివాలయం

- శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పశు వైద్యశాలకు రూ.5 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. వీటితో పాటు శివాలయం వద్ద భక్తులకు విశ్రాంతి భవనం, కుళాయిలు నిర్మించారు.
- కోరుపల్లి, గొల్లవిల్లి వారి కళ్లాలకు పోవు మట్టి రోడ్లను గ్రావెల్‌గా అభివృద్ధి చేశారు.
- 42 మందికి జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు.
- నాడు – నేడు మొదటి దశలో రూ.61 లక్షలతో హైస్కూలు, ఎంపీపీ పాఠశాలలను అభివృద్ధి చేశారు. గతంలో ఇదే గ్రామానికి చెందిన సర్పంచ్ భార్య ప్రభావతి జెడ్పీటీసీగా పనిచేసినప్పుడు రూ.30 లక్షలతో సీసీరోడ్లు, ఎస్సీ కాలనీలో రూ.3 లక్షలతో అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు నిర్మించారు.
- సర్పంచ్ సంజీవిరావు సొంత సొమ్ముతో తన తల్లిదండ్రులు జ్ఞాపకార్థంగా ఆలయాల వద్ద సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశారు.
- ఇంటింటికీ తాగునీరు

జలజీవన్ మిషన్ నుంచి రూ.72 లక్షలతో ఇంటింటి కుళాయి కనెక్షన్ల ఏర్పాటు చేశారు. ఇంటి వద్దకే తాగునీరు సరఫరా కావడంతో గ్రామ మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మామిడితోటలో మరో రూ.15 లక్షలతో ఇంటింటి కుళాయి కనెక్షన్లు మంజూరు చేశారు. ఎడ్ల వీధికి రూ.10 లక్షలు, అమరావతి కాలనీలో పైపులైన్ల ఏర్పాటుకు అదనంగా రూ.5 లక్షలతో తాగునీటి సమస్య పరిష్కరించారు. వీటితోపాటు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, తదితర భవనాలను నిర్మించారు. ఈ విధంగా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావును ప్రజలు అభినందిస్తున్నారు.



ఎం. కోడూరులో శ్మశానానికి వెళ్లే సీసీరోడ్డు

ఏటికెళ్లి నీరుతెచ్చుకునేవాళ్లం..



గతంలో వర్షం వస్తే ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. ఇరుకు సందులో బురదలో నడిచేవాళ్లం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి వీధికి సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. వీటితో పాటు ఇంటింటి కుళాయిల ఏర్పాటుతో తాగునీటి సమస్య తీరింది. గతంలో ఏటికెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వచ్చేది.

– మైచర్ల చిలుకమ్మ, ఎం. కోడూరు, ఎరుకులవీధి, మాడుగుల మండలం

ఎంతో అభివృద్ధి చేశాం



గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశాం. పంచాయతీలో తాగునీరు, సీసీరోడ్లు, తదితర మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసిన ఘనత డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకే దక్కుతోంది. గడప గడపకు కార్యక్రమం ద్వారా తెలుసుకుని రూ.1.12 కోట్లు మంజూరు చేశారు. గతంలో జెడ్పీటీసీ నిధులతో అభివృద్ధి చేశాం. ప్రజల సహకారంతో గ్రామాన్ని ఆదర్శంగా చేస్తాం.

– గొల్లవిల్లి సంజీవిరావు, సర్పంచ్, ఎం. కోడూరు, మాడుగుల మండలం

శ్మశానవాటిక రోడ్డు కష్టాలు తప్పాయి



అభివృద్ధికి మారుపేరుగా ఎం. కోడూరు నిలిచింది. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతోంది. 30 సంవత్సరాల నుంచి శ్మశానవాటికకు రహదారి లేక ఇబ్బందులు పడేవారం. రోడ్డు, బ్రిడ్జి నిర్మాణంతో చిరకాల వాంఛ నెరవేరింది. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, సర్పంచ్‌కు రుణపడి ఉంటాం.

– పడాల అప్పలనాయుడు, ఎం. కోడూరు

హోరెత్తిన ధర్మశ్రీ ఎన్నికల ప్రచారం



ధర్మశ్రీ ప్రచారంలో పాల్గొన్న మహిళలు, యువకులు

- చోడవరంలో వెల్లివిరిసిన మహిళా చైతన్యం
- అదే బాటలో కదలిన యువత

చోడవరం: ఒక పక్క మహిళా చైతన్యం... మరో పక్క యువతరం ఉత్సాహం.. జైజై జగన్, జై ధర్మశ్రీ నినాదాలతో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. మీలో ఒకడిగా.. మీ కష్ట సుఖాల్లో తోడుగా ఉంటానంటూ ఇంటింటికీ వెళ్లి తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి కోటవీధి ప్రజలంతా నీరాజనం పట్టారు. మద్దతుగా ఆయన సతీమణి విజయలక్ష్మి ప్రచారం చేశారు. ఈమె వెంట పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి ప్రచారం చేశారు. చోడవరం పట్టణంలో 13, 14, 15 వార్డుల్లో కోటవీధి, గండికాలనీ, పీఎస్‌పేట రోడ్డు, శివాలయంవీధి ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ధర్మశ్రీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వినాయకుడి గుడి దగ్గర నుంచి ప్రచారాన్ని ప్రారంభించగా పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు నీరాజనం పలికారు. పూలవర్షం కురిపించి, అడుగడుగునా హారతులు పట్టారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతీ కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబం పొందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీ ఇంటికి ఎటువంటి లంచాలు లేకుండా సంక్షేమ పథకాలు అందాయన్నారు. పింఛన్లు, అమ్మఒడి, రైతు భరోసా, చేయూత వంటి పథకాలు అందరి కుటుంబాలకు ఎంతో మేలు చేశాయన్నారు. ఐదేళ్లలో చోడవరం పట్టణంలో పూర్తిగా మంచినీటి సమస్య పరిష్కరించానని, ఎంతో ప్రఖ్యాతి గాంచిన దేవాలయాలన్నీ అభివృద్ధి చేశానని చెప్పారు. ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. మరో పక్క ధర్మశ్రీ సతీమతి విజయలక్ష్మి మహిళలతో కలిసి ఇదే వీధుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీపీ గాడి కాసు, వార్డు మెంబర్లు చిటికెల నాగేష్, పుత్రేవు శ్యామ్‌ప్రసాద్, బొడ్డు ప్రసాద్, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి అల్లాడ భవానీ, మహిళా ప్రతినిధులు విజయలక్ష్మి, అన్నపూర్ణ, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మహిళా అధ్యక్షురాలు యర్రా దేవి పాల్గొన్నారు.



చోడవరం ప్రచారంలో ధర్మశ్రీ సతీమణి విజయలక్ష్మి

లోకల్, నాన్ లోకల్ పోరులో వైఎస్సార్‌సీపీదే విజయం

- తారువలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి, అనురాధలకు ప్రజా మద్దతు



బూడి ముత్యాలనాయుడు, అనురాధలను సత్కరిస్తున్న జంపెన నాయకులు



ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధను అభినందిస్తున్న జి. అగ్రహారం నాయకులు

దేవరాపల్లి/మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధలను జిల్లా వ్యాప్తంగా పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తారువలో శుక్రవారం వీరంతా కలిసి ఘనంగా సత్కరించారు. లోకల్-నాన్ లోకల్ మధ్య ఎన్నికల సంగ్రామంలో స్థానిక వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. స్థానిక సమస్యలపైన, ప్రజావసరాలపైన కనీసం అవగాహన లేని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పెత్తందార్లకు తగిన గుణపాఠం చెబుతామని ముక్తకంఠంతో అన్నారు. మాడుగుల మండలం జంపెన సర్పంచ్ నేమాని గురువునాయుడు, సచివాలయ కన్వీనర్ పచ్చికూర మాణిక్యం, జి. అగ్రహారం ఎంపీటీసీ సభ్యురాలు ఆర్లె మాధవి భర్త ఆర్లె నాయుడు, ఏఎంసీ కమిటీ డైరెక్టరు నందారపు సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



మాకవరపాలెం చర్చిలో క్రైస్తవుల ప్రార్థన



కొత్తకోటలో భారీ శిలువతో శాంతి ర్యాలీ

మాకవరపాలెం/రావికమతం/రోలుగుం/కె.కోటపాడు/మాడుగులరూరల్: క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు దైవ సందేశమిచ్చారు. యేసు క్రీస్తు చూపిన మార్గం ఆచరణీయమని తెలిపారు.

4 నుంచి సదరం స్లాట్ బుకింగ్స్

మాడుగుల రూరల్: గ్రామ/వార్డు సచివాలయాల్లో సదరం ధ్రువపత్రాలు పొందడం కోసం వచ్చే నెల నాల్గో తేదీ నుంచి స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చునని దివ్యాంగులు సంఘం అధ్యక్షుడు బి. నూక అప్పారావు శుక్రవారం తెలిపారు. ఏప్రిల్, మే, జూన్, మాసాలకు సంబంధించి దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాల జారీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వచ్చే నెల 8వ తేదీ నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్క్రీనింగ్ నిర్వహించి, ఆర్థోపెడిక్, మానసిక, కంటి, ఈఎన్‌టీ వైద్యులు పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి ధ్రువపత్రాలు అందజేస్తారన్నారు.


పాలిసెట్ ఉచిత శిక్షణ ప్రారంభం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న బంగారు రాజు

మాడుగుల రూరల్: సృజనవాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వీరవల్లి అగ్రహారంలో పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వడ్డాదికి చెందిన వర్తకుడు పలుకూరి బంగారు రాజు, సంస్థ సమన్వయకర్త ఆర్. రామారావు, ఉపాధ్యాయులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సంస్థ సమన్వయకర్త రామారావు మాట్లాడుతూ ఏటా ఉచితంగా పాలిసెట్ శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతిభ పరీక్ష ఆధారంగా పది పాఠశాలల నుంచి 60 మందిని ఎంపిక చేశామని, వారికి వచ్చే నెల 25వ తేదీ వరకు శిక్షణ ఇస్తామన్నారు. ఉపాధ్యాయులు హరికృష్ణ, తలుపులునాయుడు, హరిబాబు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు



దాలింపేట వద్ద తనిఖీలు చేస్తున్న తహసీల్దార్

మాకవరపాలెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. దాలింపేట వద్ద విశాఖ–నర్సీపట్నం ప్రధాన రహదారిలో శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్‌తో కలసి తహసీల్దార్ మురళీమోహనరావు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ఉల్లఘించి నగదు, మద్యం, తదితరవి తరలిస్తే వాహనాల సీజ్ చేస్తామన్నారు. డీటీ శంకర్రావు పాల్గొన్నారు.

వలంటీర్లపై చంద్రబాబుకు, దత్తపుత్రుడికి అక్కసు

- వారిని కించపరిస్తే తగిన గుణపాఠం
- వైఎస్సార్‌సీపీ మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధ ధ్వజం



దేవరాపల్లి: వలంటీర్లను చూస్తే చంద్రబాబు, దత్తపుత్రుడు, ఆ పార్టీల నాయకుల వెన్నులో వణుకు పుడుతుందని, అందుకే నిస్వార్థ సేవలందిస్తున్న వారిపై దుర్భాషలాడుతూ అక్కసు వెళ్లగక్కుతున్నారని వైఎస్సార్‌సీపీ మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధ విమర్శించారు. శుక్రవారం తారువలో ఆమె మాట్లాడారు. నామమాత్రపు గౌరవ వేతనంతో సేవలందిస్తున్న వలంటీర్లను టీడీపీ నాయకులు ఉగ్రవాదులతో పోల్చి వారి ఆత్మస్థైర్యం దెబ్బతినేలా అవమానకరంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళల అదృశ్యానికి వలంటీర్లే కారణమని, తాము అధికారంలోకి వస్తే వారి నడుం విరగ్గొడతామని, అంతు చూస్తామని బెదిరింపులకు దిగడం సిగ్గు చేటని ధ్వజమెత్తారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. వలంటీర్లను కించ పరిచేలా విమర్శలు చేస్తున్న టీడీపీకి తాజా ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

హామీలు ఎగ్గొట్టడంలో చంద్రబాబు ఘనుడు

జెడ్పీటీసీ రాంబాబు ధ్వజం



విజయరామరాజుపేటలో ఇంటింటా ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట: దగాకోరు హామీలు ఇవ్వడమే కాదు, వాటిని ఎగ్గొట్టడంలో చంద్రబాబును మించిన వారు లేరని జెడ్పీటీసీ దొండా రాంబాబు విమర్శించారు. శుక్రవారం విజయరామరాజుపేటలో ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీకి మద్దతుగా పార్టీ మండల నాయకులతో కలిసి రాంబాబు ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సాటిలేరన్నారు. పేదల సంక్షేమం కోసం టీడీపీ ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తమ ప్రభుత్వంలో అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, పింఛన్, విద్యా దీవెన, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ, తదితర పథకాలతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు చేయడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతి ఇంటికెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. రెండో సారి ముఖ్యమంత్రిగా జగనన్నను, ఎమ్మెల్యేగా కరణం ధర్మశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. సర్పంచ్ ఎల్లపు విజయ్‌కుమార్, కోఆపరేటివ్ అధ్యక్షుడు ఎల్లపు గోవింద, వైస్ సర్పంచ్ దొడ్డి జన్నాథరావు, శరగడం ముత్యాలనాయుడు, మహాలక్ష్మినాయుడు, పెంటకోట కృష్ణ, బొడ్డేటి మహాలక్ష్మినాయుడు, కోరుబిల్లి రాజునాయుడు, ఎల్లపు శ్రీను, బేతి రాజు, మళ్ల వెంకటరావు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో తాండవ కాలువల్లో పూడిక తీత

రూ.1.55 కోట్లతో 20 కిలోమీటర్ల పనులు



తాండవ ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడిక

నాతవరం: ఉపాధి హామీ పథకంలో తాండవ కాలువలో పూడిక తీత పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. కలెక్టరు ఆదేశాలతో ఈ ఏడాది తాండవ ప్రాజెక్టు పరిధిలో పెద్ద, చిన్న కాలువల్లో పూడిక తొలగించేందుకు ఇరిగేషన్, ఉపాధి హామీ పథకం అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. వచ్చే నెల మొదటి వారంలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వేసవిలోనే ఏటా తాండవ కాలువల్లో పూడిక తీత పనులు నిర్వహిస్తారు. గతంలో యంత్రాలతో యంత్రాలతో పనులు చేయడం వల్ల కాలువలో సిమెంట్ లైనింగ్ దెబ్బతింటోంది. అందువల్ల ఉపాధి హామీ పథకం కూలీలతో పనులు చేయాలని కలెక్టర్ నిర్ణయించారు. నాతవరం మండలంలో 20 కిలో మీటర్ల పొడవున పెద్ద, చిన్న కాలువల్లో రూ. 1,55,87,557 వ్యయంతో చేపట్టే పూడిక తీసే పనుల ప్రతిపాదనలను కలెక్టరు ఆమోదించారు. తాండవ రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు నీరు ప్రవహించేందుకు నాతవరం, కోటనందూరు, పాయకరావుపేట, కోటవురట్ల, నర్సీపట్నం, తుని, రవతలపూడి శంకవరం మండలాలు పరిధిలో 120 కిలో మీటర్ల పొడవున కాలువలున్నాయి. ముందుగా నాతవరం మండలంలో పూడిక తీత పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవిషయంపై ప్రాజెక్టు డీఈ అనురాధను సంప్రదించగా వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు నీరు అందించేందుకు వీలుగా వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తామన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న అనురాధ

చీడికాడ: శిరిజాంలోని అగ్ని ప్రమాద బాధిత రైతులను వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధ శుక్రవారం పరామర్శించారు. గంపాన వారి కళ్లాలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆమె సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద తీరును అడిగి తెలుసుకున్నారు. బాధిత రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరనున్నట్లు చెప్పారు. ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, సర్పంచ్ కన్నూరి సత్యవతి, చీడికాడ, దేవరాపల్లి మండలాల అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, బూరె బాబూరావు, నాయకులు చుక్కా అప్పలనాయుడు, కన్నూరి చెల్లంనాయుడు, పుట్టా రాంకుమార్ పాల్గొన్నారు.